సాక్షి శ్రీసత్యసాయి జిల్లా



చీనీ టన్ను రూ.36 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో మంగళవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.36 వేలు పలికాయి. మార్కెట్‌కు 367 టన్నులు అమ్మకానికి వచ్చాయి.



టమాట కిలో రూ.15

కక్కలపల్లి మండీలో మంగళవారం కిలో టమాట ధర గరిష్టంగా రూ.15, కనిష్టం రూ.5, సరాసరి రూ.8 పలికింది. మార్కెట్‌కు 213 టన్నులు అమ్మకానికి వచ్చాయి.

గరిష్టం/కనిష్టం
37.6°/9.6°

జిల్లాలో మంగళవారం ఉదయం చలి తీవ్రత నెలకొంది. పగటి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదు కాగా.. రాత్రి తగ్గుముఖం పట్టాయి. ఆగ్నేయ దిశగా గాలులు గంటకు 6 నుంచి 8 కిలో మీటర్ల వేగంతో వీచాయి.

న్యూస్‌రీల్

పింఛన్ల పంపిణీకి రూ.73.65 కోట్లు విడుదల

పుట్టపర్తి అర్బన్: మార్చి నెలకు సంబంధించిన సామాజిక భద్రతా పింఛన్ల పంపిణీ కోసం ప్రభుత్వం రూ.73.65 కోట్లు విడుదల చేసిందని డీఆర్‌డీఏ పీడీ నరసయ్య తెలిపారు. జిల్లాలో 32 మండలాల పరిధిలో 2,64,525 మంది పింఛన్ లబ్ధిదారులు ఉన్నారన్నారు. ప్రభుత్వం విడుదల చేసిన మొత్తాన్ని ఇప్పటికే సచివాలయ ఉద్యోగుల ఖాతాలకు జమ చేశామని, వారు డబ్బు డ్రా చేసి వలంటీర్లకు అందజేశారన్నారు. బుధవారం తెల్లవారు జాము నుంచే వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి పింఛన్ అందజేస్తారన్నారు. జిల్లాలో 5 రోజుల పాటు పింఛన్ పంపిణీ కొనసాగుతుందన్నారు.

నేటి నుంచి జెడ్పీ స్థాయీ సంఘాల సమావేశాలు

అనంతపురం సిటీ: ఉమ్మడి జిల్లా పరిషత్ స్థాయీ సంఘాల సమావేశాలు బుధవారం ప్రారంభం కానున్నట్లు సీఈఓ భాస్కర్‌రెడ్డి మంగళవారం తెలిపారు. రెండ్రోజుల పాటు జరిగే సమావేశాల్లో తొలి రోజు స్థాయీ సంఘం-1, 3, 7 (ఆర్థిక, ప్రణాళిక/వ్యవసాయం /ఇంజినీరింగ్ శాఖలు) సమావేశాలు ఉంటాయన్నారు. జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, స్థాయీ సంఘాల అధ్యక్షుల అధ్యక్షతన జరిగే సమావేశాలకు అధికారులు కచ్చితంగా హాజరు కావాలని పేర్కొన్నారు. గత సమావేశాల్లో జరిగిన చర్చలు, లేవనెత్తిన అంశాలకు సంబంధించి తీసుకున్న చర్యలపై చర్చించాల్సి ఉంటుందన్నారు.

పోలింగ్‌పై సంపూర్ణ అవగాహన ఉండాలి



మాట్లాడుతున్న కలెక్టర్ బసంత్‌కుమార్

పుట్టపర్తి టౌన్: పట్టభద్ర, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ప్రక్రియపై పీఓ, ఏపీఓలకు పూర్తి అవగాహన ఉండాలని, ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా సమర్థవంతంగా నిర్వహించాలని కలెక్టర్ బసంత్‌కుమార్ అన్నారు. మంగళవారం స్థానిక సాయిఆరామంలో పట్టభద్ర, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణపై పోలింగ్ అధికారులు (పీఓ), సహాయ పోలింగ్ అధికారులకు (ఏపీఓ) మొదటి విడత శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కలెక్టర్ బసంత్‌కుమార్ హాజరై పోలింగ్ నిర్వహణపై దిశానిర్దేశం చేశారు. జిల్లాలో పట్టభద్రులకు సంబంధించి 54, ఉపాధ్యాయ ఓటర్ల కోసం 32 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. పోలింగ్ ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా ఉండేందుకు మాస్టర్ ట్రైనర్లతో మూడు విడతల శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చేశామన్నారు. పోలింగ్‌పై పూర్తి వివరాలు తెలుసుకుని సమర్థవంతంగా విధులు నిర్వర్తించాలన్నారు. పోలింగ్ ప్రక్రియపై ఎక్కడైనా ఫిర్యాదులు వస్తే సంబంధిత అధికారులపై చర్యలు తప్పవన్నారు. అనంతరం డీఆర్ఓ కొండయ్య మాట్లాడుతూ.. బ్యాలెట్ పేపర్ అకౌంట్ పరిశీలించుకోవాలన్నారు. పీఓ డైరీ, డిక్లరేషన్ మొదలైన అంశాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో పెనుకొండ, కదిరి, పుట్టపర్తి, కదిరి డివిజన్ల పోలింగ్ అధికారులు, సహాయ పోలింగ్ అధికారులు పాల్గొన్నారు.

బసవేశ్వర వాహనంపై చంద్రమౌళీశ్వరుడు



ఉరవకొండ: ఉరవకొండ గవిమఠం చంద్రమౌళీశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామివారు మంగళవారం బసవేశ్వర వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం మూలవిరాట్‌కు విశేష పూజలు, అభిషేకాలు చేశారు. అనంతరం మహా గణారాధన కార్యక్రమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం చంద్రమౌళీశ్వరస్వామి ఉత్సవ మూర్తిని గవిమఠం పీఠాధిపతులు జగద్గురు చెన్నబసవ రాజేంద్రస్వామి, ఉత్తరాధికారి కరిబసవరాజేంద్రస్వామి, సహాయ కమిషనర్ చిట్టెమ్మ ఆధ్వర్యంలో ఊరేగింపుగా తీసుకొచ్చి బసవేశ్వర వాహనంపై కొలువు తీర్చి ఊరేగించారు. బ్రహ్మోత్సవాల్లో బుధవారం మహా రథోత్సవం నిర్వహించనున్నారు.

వసంత వల్లభా..ఖాద్రీశా

800 ఏళ్లపైబడి చరిత్ర కలిగిన దివ్య క్షేత్రం. నవ నరసింహాలయాల్లో అత్యంత ప్రాధాన్యత కలిగిన ఆలయం. రాయల కాలం నాటి శిల్పకళా నైపుణ్యం. ప్రహ్లాద సమేతంగా కొలువుదీరిన లక్ష్మీనరసింహుడి దివ్యరూపం. మల్లెల పరిమళం.... అధ్యాత్మిక సౌరభం. కాటమరాయుడిగా ఖాద్రీశుడు నిత్య పూజలందుకుంటున్న ఇల వైకుంఠం. మనమూ ఓసారి దర్శించుకుందాం. రేపటి నుంచి ప్రారంభమయ్యే బ్రహ్మోత్సవాల్లో వసంత వల్లభుడిని కనులారా వీక్షిద్దాం.

- రేపటి నుంచి లక్ష్మీనారసింహుని బ్రహ్మోత్సవాలు
- 3వ తేదీ శ్రీవారి కల్యాణోత్సవం
- 13న స్వామివారి బ్రహ్మ రథోత్సవం



శ్రీవారి బ్రహ్మరథోత్సవం(ఫైల్)

కదిరి: వసంత వల్లభుడిగా, కాటమరాయుడిగా, ప్రహ్లాద వరద లక్ష్మీ నారసింహుడిగా పూజలందుకుంటున్న ఖాద్రీ లక్ష్మీ నరసింహ స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు ఈ నెల 2వ తేదీన అంకురార్పణంతో ప్రారంభం కానున్నాయి. పక్షం రోజుల పాటు అత్యంత వైభవంగా జరిగే ఈ ఉత్సవాల్లో రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటక, తమిళనాడు నుంచి కూడా భక్తులు భారీగా తరలి వస్తారు. బ్రహ్మదేవుడే దగ్గరుండి నడిపిస్తున్నందున వీటిని బ్రహ్మోత్సవాలు అంటారని అర్చక పండితులు చెబుతారు. భక్త ప్రహ్లాద సమేత నారసింహుని దర్శనం ఇక్కడి విశేషం.

శ్రీ మహావిష్ణువు దానవుడైన హిరణ్యకశ్యపుని శిక్షించేందుకు, తన భక్తుడైన ప్రహ్లాదుని రక్షించేందుకు నరసింహ అవతారంలో స్తంభం నుంచి ఉద్భవించాడు. హిరణ్య కశ్యపుని సంహారం అనంతరం ఆ ఉగ్ర రూపంలోనే సమీపంలోని కదిరి కొండ వద్ద సంచరిస్తుండగా...మహర్షులు ఆయన్ను శాంతింపజేసేందుకు ఆ కొండపై నుంచి నారసింహుని వేడుకున్నారు. దీనికి గుర్తుగా ఆ కొండపై నారసింహుని ఆలయం కూడా ఉంది. అదే కొండపై శ్రీవారి పాద ముద్రికలు కూడా ఉన్నాయి. అందుకే ఈ ప్రాంతాన్ని 'ఖాద్రి' అని పిలిచారు. 'ఖా' అంటే విష్ణుపాదమని, 'అద్రి' అంటే కొండ అని అర్థం. ఖాద్రి కాస్త కాలక్రమంలో కదిరిగా పిలవబడుతోంది.

మహిమాన్వితుడు నృసింహుడు

కదిరి ప్రాంతంలో ఒకప్పుడు ఖాదిరి వృక్షాలు(చంద్ర వృక్షాలు)ఎక్కువగా ఉండేవి. ఈ చెట్ల కింద ఒక పుట్టలో నారసింహుడు స్వయంభుగా వెలిశాడని... అందుకే ఖాద్రీ నారసింహుడని పిలుస్తున్నారని మరో కథనం. ప్రతి నెలా స్వాతి నక్షత్రం రోజు ఇక్కడి మూల విరాట్‌కు అభిషేకం చేస్తారు. అభిషేకానంతరం స్వామి హృదయ భాగం నుంచి స్వేద బిందువులు చూడచ్చు. ఇది స్వామివారి మహిమ అని ఇక్కడి భక్తులు భావిస్తారు.

రంగనాయకులు ఆధ్వర్యంలో ఆలయ నిర్మాణం

10వ శతాబ్దంలో అప్పటి పట్నం పాలేగారైన రంగనాయకుడికి చెందిన గోవులు రోజూ ఖాదిరి వృక్షాల కింద ఉన్న ఒక పుట్టలో పాలు వదిలేవి. ఆ పాలను నారసింహుడు తాగేవారని భక్తుల నమ్మకం. అందువల్లనే రంగనాయకులు ఆర్థికంగా బాగా ఎదిగారని ఒక కథనం. ఓ రోజు ఆయనకు శ్రీవారు కలలో కన్పించి తాను స్వయంభుగా వెలిశానని, పుట్టలో ఉన్న తన విగ్రహాన్ని వెలికితీసి తనకు గుడి కట్టించమని కోరితే ఆలయం నిర్మించినట్లు బ్రహ్మాండ పురాణం ద్వారా తెలుస్తోంది. నాటి ఆలయం కాలగతిలో అదృశ్యం కావడంతో బుక్కరాయలు, ఆ తర్వాత హరిహర రాయలు, చివరిగా శ్రీకృష్ణ దేవరాయల (13 శతాబ్దం నుంచి 15వ శతాబ్దం వరకూ) కాలంలో ఈ గుడి సంపూర్ణ నిర్మాణం జరిగినట్లు చారిత్రక ఆధారాలు చెబుతున్నాయి.

వసంత వల్లభుడని కూడా పేరు

శ్రీ మహావిష్ణువు అనుగ్రహం కోసం భృగు మహర్షి ఈ ప్రాంతంలో తపస్సు చేశాడని, అందుకు మెచ్చిన విష్ణువు తాను కోనేటిలో వెలిశానని, తన విగ్రహాలను వెలికి తీసి పూజాది కార్యక్రమాలు చేయాలని చెప్పినట్లు పూర్వీకులు చెబుతారు. ఈ మేరకు ఉత్సవ విగ్రహాల వెలికితీసి పూజలు చేశారు. అది వసంత మాసంలో జరిగింది కనుక స్వామివారికి వసంత వల్లభుడని పేరు కూడా ఉంది. అందుకే కోనేరును భృగు తీర్థమని పిలుస్తారు. ఆ ఉత్సవ విగ్రహాలనే బ్రహ్మోత్సవాల్లో రోజూ తిరువీధుల్లో ఊరేగిస్తారు. ఇంతటి తేజస్సు ఉన్న ఉత్సవ విగ్రహాలు దేశంలో మరెక్కడా లేవని భక్తులు చెబుతారు.

దేశంలోనే 3వ అతి పెద్ద తేరు

130 ఏళ్ల క్రితం తయారు చేసిన ఖాద్రీశుని బ్రహ్మ రథం సుమారు 540 టన్నుల బరువు, 37.5 అడుగుల ఎత్తు ఉంది. రథంలోని పీఠం వెడల్పు 16 అడుగులు ఉంటుంది. రథంపై 256 శిల్ప కళాకృతులను టేకుతో అందంగా తీర్చి దిద్దారు. తమిళనాడులోని అండాల్ అమ్మవారి శ్రీవల్లి పుత్తూరు రథం, తంజావూరు జిల్లాలోని తిరువార్ రథం తర్వాత 3వ అతి పెద్దది ఈ ఖాద్రీ నృసింహుని రథం.

బ్రహ్మోత్సవాలు ఇలా...

తేదీ	ఉత్సవం
2	అంకురార్పణం
3	శ్రీవారి కల్యాణోత్సవం
4	హంస వాహనం
5	సింహ వాహనం
6	హనుమంత వాహనం
7	బ్రహ్మ గరుడ సేవ
8	శేష వాహనం
9	సూర్య, చంద్ర ప్రభ
10	మోహినీ ఉత్సవం
11	ప్రజా గరుడ సేవ
12	గజ వాహనం
13	బ్రహ్మ రథోత్సవం(తేరు)
14	అలుకోత్సవం
15	తీర్థవాది ఉత్సవం
16	పుష్ప యాగోత్సవం

నా జీవితం స్వామి సేవకే



కదిరి నారసింహుడికి ఏళ్లుగా సేవ చేస్తున్నా. స్వామి సేవలోనే నాకు సంతృప్తి. ప్రహ్లాద సమేత నారసింహుడి దర్శనం ఇంకెక్కడా జరగదు. బ్రహ్మోత్సవాలు పక్షం రోజులు జరిగేది ఇక్కడే. స్వాతి నక్షత్రం రోజు మూలవిరాట్‌కు జరిగే అభిషేకం చూస్తే స్వామి మహిమ ఏమిటో తెలుస్తుంది.

–నరసింహాచార్యులు, ఆలయ ప్రధాన అర్చకులు

భారీ ఏర్పాట్లు చేస్తున్నాం



బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయంలో రోజంతా నిత్యాన్న దానం ఉంటుంది. కల్యాణోత్సవంతో పాటు భక్తులు పెద్ద సంఖ్యలో విచ్చేసే రథోత్సవానికి ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నాం. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అందరి సహకారంతో ముందస్తు చర్యలు తీసుకుంటున్నాం.

–పట్టెం గురుప్రసాద్, ఆలయ ఈఓ

నా అదృష్టం



నరసింహ స్వామికి ఈ రకంగా సేవ చేసుకునే భాగ్యం దక్కడం నా అదృష్టం. ఈసారి భక్తులు గతం కంటే ఎక్కువగా రావొచ్చని అంచనా వేస్తున్నాం. అందుకు తగ్గట్టుగా అన్ని సౌకర్యాలు కల్పించేందుకు ఆలయ కమిటీ సమాయత్తంగా ఉంది. స్థానికుల సహాయ సహకారాలు కూడా మాకు కొండంత బలం.

–జెరిపిటి గోపాలకృష్ణ, ఆలయ కమిటీ చైర్మన్

ప్రభుత్వం నుంచి పట్టు వస్త్రాలు



3వ తేదీన జరిగే శ్రీవారి కల్యాణోత్సవానికి రాష్ట్ర ప్రభుత్వం నుంచి పట్టువస్త్రాలు తీసుకొస్తాం. ఈ బ్రహ్మోత్సవాల్లో కుల, మతాలకతీతంగా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొంటారు. వారికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడాల్సిన బాధ్యత మాపై ఉంది. ఆలయ కమిటీతో పాటు అధికారులు నిత్యం అందుబాటులో ఉంటూ సేవలందిస్తారు.

–డా.పీవీ సిద్దారెడ్డి, ఎమ్మెల్యే, కదిరి

అప్రమత్తంగా ఎన్నికల విధులు

- ఓటర్లకు స్లిప్పులు పంపిణీ చేయాలి
- అధికారులకు ఇన్‌చార్జ్ కలెక్టర్ కేతన్‌గార్గ్ ఆదేశం



వీడియో కాన్ఫరెన్స్‌లో ఇన్‌చార్జ్ కలెక్టర్ కేతన్‌గార్గ్, చిత్రంలో డీఆర్వో గాయత్రీదేవి

అనంతపురం అర్బన్: పశ్చిమ రాయలసీమ పట్టభద్ర, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల విధులను అధికారులు అప్రమత్తంగా నిర్వర్తించాలని రిటర్నింగ్ అధికారి, ఇన్‌చార్జ్ కలెక్టర్ కేతన్‌గార్గ్ ఆదేశించారు. ఓటర్ స్లిప్పుల పంపిణీ ప్రారంభించాలని చెప్పారు. ఎన్నికల నిర్వహణ అంశంపై ఇన్‌చార్జ్ కలెక్టర్ మంగళవారం కలెక్టరేట్ నుంచి అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి, డీఆర్వో గాయత్రీదేవి, ఎంసీసీ నోడల్ అధికారి కేశవనాయుడుతో కలిసి పుట్టపర్తి, వైఎస్సార్, అన్నమయ్య, కర్నూలు, నంద్యాల జిల్లాల డీఆర్వోలు, నోడల్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి బ్యాలెట్ పేపర్లను అనంతపురం మినహా మిగలిన ఐదు జిల్లాలకు ఈ నెల 11న ఉదయం తొమ్మిది గంటలకు అనంతపురం కలెక్టరేట్‌లో పంపిణీ చేస్తామన్నారు. ఆయా జిల్లాల నుంచి జిల్లా ఎన్నికల అధికారి అథారిటీ లేఖతో అధికారులను పంపించి బ్యాలెట్ పేపర్లను తగిన బందోబస్తుతో తీసుకెళ్లాలని సూచించారు. 12వ తేదీన పోలింగ్ స్టేషన్లకు చేర్చాలన్నారు. బహిరంగ సభలు, ర్యాలీలు, వాహనాలకు అనుమతి కోసం జిల్లా కేంద్రాల్లో సింగిల్ విండో సిస్టం ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. ఎన్నికల్లో ఓటింగ్ విధానంపై ఈ నెల 3న మండలస్థాయిలో, ఈ నెల 6న గ్రామస్థాయిలో ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు.

ఓటర్లకు స్లిప్పులు చేర్చండి

ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటర్లుగా ఉన్నవారికి అనంతపురం జిల్లాలో ఓటరు స్లిప్పుల పంపిణీ వెంటనే ప్రారంభించాలని ఇన్‌చార్జ్ కలెక్టర్ కేతన్‌గార్గ్ ఆదేశించారు. ఇతర జిల్లాల్లో ఏడోతేదీలోగా పంపిణీ పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

బ్యాలెట్ పెట్టెలు భద్రపర్చాలి

ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ 13న పూర్తయిన తరువాత బ్యాలెట్ పెట్టెలను స్ట్రాంగ్‌రూమ్‌కు చేర్చి భద్రపర్చాలన్నారు. ఆ సమయంలో బ్యాలెట్ పేపర్ అకౌంట్, ప్రొసీడింగ్ అధికారి డైరీ, ఇన్సిడెన్స్ రిపోర్ట్ తదితర అంశాలను పరిశీలించుకుని, అక్కడ డిపాజిట్ చేయాలని సూచించారు. 14న అనంతపురంలోని జేఎన్‌టీయూలో ఓట్ల లెక్కింపు కేంద్రం ఏర్పాటు చేస్తామని, ఆయా జిల్లాల నుంచి బ్యాలెట్ పెట్టెలను బందోబస్తుతో ఇక్కడికి చేర్చాలన్నారు. వచ్చిన సిబ్బందికి ఓట్ల లెక్కింపుపై అదే రోజు శిక్షణ ఇస్తామన్నారు. వీరు 16న ఓట్ల లెక్కింపు విధుల్లో పాల్గొనాల్సి ఉంటుందన్నారు. ఈ ప్రక్రియలో ఎక్కడా పొరపాట్లకు తావులేకుండా చూడాలన్నారు.

అన్నదాతలకు వెన్నుదన్ను

- 'రైతు భరోసా' మూడో విడత సాయం విడుదల
- జిల్లాలోని 2.68 లక్షల మంది రైతుల ఖాతాల్లోకి రూ.56.54 కోట్లు
- మాండూస్ తుపాను పరిహారం 226 మందికి రూ.19.37 లక్షలు
- లబ్ధిదారులకు మెగా చెక్కు పంపిణీ చేసిన అధికారులు



మెగా చెక్కు పంపిణీ చేస్తున్న అధికారులు

పుట్టపర్తి అర్బన్: ఆరుగాలం కష్టపడే రైతన్నలకు జగన్ సర్కార్ అండగా నిలుస్తోంది. రైతు వేసే ప్రతి అడుగులోనూ తోడుగా ఉంటోంది. ఈ క్రమంలోనే 'వైఎస్సార్ రైతు భరోసా- పీఎం కిసాన్' పథకానికి సంబంధించి వరుసగా నాలుగో ఏడాది పథకం అమలు చేస్తోంది. ఈ ఏడాదికి సంబంధించిన మూడో విడత సాయాన్ని మంగళవారం విడుదల చేసింది. అలాగే మాండూస్ తుపానుతో పంటలు కోల్పోయిన రైతులకూ పరిహారాన్ని నేరుగా రైతుల ఖాతాల్లో జమ చేసింది మంగళవారం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గుంటూరు జిల్లా తెనాలిలో 'వైఎస్సార్ రైతు భరోసా- పీఎం కిసాన్'తో పాటు ఇన్‌పుట్ సబ్సిడీ నిధులు రైతుల జమ చేసే కార్యక్రమాన్ని కంప్యూటర్‌లో బటన్ నొక్కి ప్రారంభించారు. జిల్లా కేంద్రం పుట్టపర్తి ఎంపీడీఓ కార్యాలయంలో అధికారులు అర్హులైన రైతులకు 'రైతు భరోసా' సొమ్ముతో పాటు ఇన్‌పుట్ సబ్సిడీకి సంబంధించిన మెగా చెక్కును అందజేశారు.

వ్యవసాయాన్ని పండుగ చేసిన సీఎం

జిల్లా వ్యవసాయాధికారి సుబ్బారావు, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి చంద్రశేఖర్, ఏరువాక శాస్త్రవేత్త రామసుబ్బయ్య తదితరులు మాట్లాడుతూ... సీఎం వైఎస్ జగన్ వ్యవసాయాన్ని పండుగ చేశారన్నారు. ఈ క్రమంలో ప్రతి దశలోనూ రైతులకు అండగా నిలుస్తున్నారన్నారు. విత్తు నుంచి పంట ఉత్పత్తులు విక్రయించుకునే వరకూ అండగా నిలుచారన్నారు. సచివాలయాలు, రైతు భరోసాకేంద్రాలు ఏర్పాటు చేసి రైతులకు ఏ ఇబ్బంది లేకుండా చూస్తున్నారన్నారు. కేవికే రెడ్డిపల్లి వ్యవసాయ క్షేత్రం, కదిరి వ్యవసాయ క్షేత్రం నుంచి నూతన వంగడాలను సృష్టించి రైతులకు అందజేస్తూ దిగుబడులు సాధించేలా చూస్తున్నారన్నారు. రైతులు కూడా తక్కువ పెట్టుబడులతో అధిక లాభాలు వచ్చే పంటలను సాగు చేయాలని సూచించారు. పంట వ్యర్థాలను పొలాల్లో కాల్చకూడదన్నారు. సేంద్రియ ఎరువుల వాడకంతో పాటు వేసవి దుక్కులు ఎంతో లాభదాయకమని సూచించారు. పంట సాగు చేసిన ప్రతి రైతూ ఈ-క్రాప్ బుకింగ్ తప్పని సరిగా చేయించాలన్నారు. డ్రిప్పు, స్ప్రింక్లర్లను తొలుత చిన్న, సన్నకారు రైతులకు అందజేసి చేస్తామన్నారు. అనంతరం 'వైఎస్సార్ రైతు భరోసా- పీఎం కిసాన్'కు అర్హులైన 2,68,947 మంది రైతులకు రూ.56.54 కోట్లు, మాండూస్ తుపాను ప్రభావంతో పంట నష్టపోయిన 226 మంది రైతులకు సంబంధించి రూ.19.37 లక్షలకు సంబంధించిన మెగా చెక్కు అందజేశారు.

సీఎం మేలు మరవలేను



సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేసిన మేలు మరువలేను. వైఎస్సార్ రైతు భరోసా కింద నాకు 12 విడతల్లో రూ.54 వేలు అందింది. సర్కారు అందించిన ఆర్థిక సాయం పంటల సాగులో నాకు ఎంతగానో ఉపయోగ పడింది. రైతులను ఇంతలా ఆదుకొనే సీఎం బహుశా దేశంలోనే ఎవరూ లేరు.

– లింగాల భాస్కర్‌రెడ్డి, బ్రాహ్మణపల్లి, పుట్టపర్తి

'ఆర్‌బీకే' సాయం చెప్పలేనిది



రైతులకు 'రైతు భరోసా కేంద్రం' సిబ్బంది అండగా నిలుస్తున్నారు. విత్తు నుంచి ఉత్పత్తులు అమ్మే వరకూ వెన్నంటే ఉంటూ వ్యవసాయంలో సాయం చేస్తున్నారు. ప్రభుత్వం ఏ పథకం తీసుకొచ్చినా ఇంటింటికీ వచ్చే తెలియజేసే వలంటీర్లు, సచివాలయ సిబ్బంది సేవలు మరువలేం.

– కురుబ చంద్రశేఖర్, పైపల్లి, పుట్టపర్తి మండలం

సీజన్ ముగిసేలోపే పరిహారం



సీజన్ ముగిసేలోపు పంట నష్ట పరిహారం అందించి రైతులను ఆదుకోవడం బహుశా చరిత్రలో ఎక్కడా జరగలేదు. పాలకుడు మంచివాడైతే ప్రకృతీ సహకరిస్తుంది. అందుకే మూడేళ్ల నుంచి ఎక్కడ చూసిన నీళ్లు ఉన్నాయి. ఉద్యాన పంటల్లో మంచి దిగుబడులు వస్తున్నాయి.

– ఓబిరెడ్డి, బుచ్చయ్యగారిపల్లి, బుక్కపట్నం మండలం

రైతులకు కీడు చేయొద్దు పల్లె



కలెక్టర్ బసంత్‌కుమార్‌కు వినతి పత్రం అందజేస్తున్న నల్లమాడ రైతులు, నాయకులు




విలేకరులతో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు, రైతులు

- రిజర్వాయర్ పనులను అడ్డుకుంటే చరిత్రహీనులవుతారు
- పల్లె రఘునాథరెడ్డిని హెచ్చరించిన నల్లమాడ మండల రైతులు
- పనులు జరిగేలా చూడాలని కలెక్టర్‌కు వినతి పత్రం

పుట్టపర్తి అర్బన్: ''రైతులకు మేలు చేయకపోయినా ఫర్వాలేదు. కీడు మాత్రం చేయకండి. నల్లమాడ రిజర్వాయర్ పూర్తయితే 193 చెరువులు నిండుతాయి. మండలమంతా సస్యశ్యామలం అవుతుంది. వేలాది రైతు కుటుంబాల్లో వెలుగులు విరజిమ్ముతాయి. అంతటి ప్రాధాన్యమున్న రిజర్వాయర్ గురించి మీరు కనీసం ఆలోచించలేకపోయారు. కనీసం చేసేవారినైనా చేయనివ్వండి. రిజర్వాయర్ పనులు అడ్డుకుని చరిత్రహీనులుగా మిగిలిపోకండి'' అని నల్లమాడకు చెందిన పలువురు రైతులు, వైఎస్సార్ సీపీ నాయకులు టీడీపీ నేత పల్లె రఘునాథరెడ్డిని హెచ్చరించారు. రైతులకు పరిహారం ఇచ్చే వరకూ నల్లమాడ మండలం ఎస్.ఎనుములవారిపల్లి వద్ద నిర్మించ తలపెట్టిన రిజర్వాయర్ పనులు నిలిపివేయాలని సోమవారం పల్లె రఘునాథరెడ్డి కలెక్టర్‌కు వినతి పత్రం ఇవ్వడంతో మంగళవారం పలువురు రైతులు, వైఎస్సార్ సీపీ నేతలు కలెక్టర్ బసంత్‌కుమార్‌ను కలిశారు. పరిహారాన్ని బూచిగా చూపుతూ పనులు ఆపవద్దని వినతిపత్రం సమర్పించారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడుతూ... కరువు ప్రాంతమైన నల్లమాడ మండలానికి సాగునీరిచ్చేందుకు రిజర్వాయర్ నిర్మాణం తప్పనిసరి అని ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి భావించారన్నారు. ఈ క్రమంలోనే ఇక్కడి పరిస్థితులను సీఎం జగన్‌మోహన్ రెడ్డికి వివరించి 193 చెరువులకు నీరందించేందుకు ఎస్.ఎనుములవారిపల్లి వద్ద రిజర్వాయర్ నిర్మాణానికి సమాయత్తమయ్యారన్నారు. ఈక్రమంలోనే జీఓ తీసుకువచ్చి టెండర్ ప్రక్రియ పూర్తి చేశారన్నారు. పనులు ప్రారంభమైన సమయంలో రైతుల పేరుతో 'పల్లె' అడ్డుకోవాలని చూడటం తగదన్నారు. రిజర్వాయర్ నిర్మాణం కోసం అవసరమైతే తమ భూములను ధారాదత్తం చేసేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. పనులు ప్రారంభమైతే పరిహారం దానంతట అదే వస్తుందన్నారు. కానీ తమ పేరుతో మొసలి కన్నీరు కారుస్తూ డ్రామా ఆడుతున్న 'పల్లె' ఇకనైనా బుద్ధితెచ్చుకుని రైతుల సంక్షేమం చూడాలన్నారు. లేకపోతే తగిన శాస్తి చేస్తామని హెచ్చరించారు. అంతకు ముందు కలెక్టర్ రైతులతో మాట్లాడుతూ... రిజర్వాయర్ నిర్మాణం కోసం భూములు కోల్పోతున్న రైతులతో సమావేశాలు ఏర్పాటు చేసి న్యాయమైన పరిహారం ఇప్పించేందుకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో జిల్లా అగ్రిబోర్డు అడ్వైజరీ చైర్మన్ అవుటాల రమణారెడ్డి, మండల కన్వీనర్ కుళ్లాయినాయక్, మాజీ ఎంపీపీ అగిశం ప్రతాప్, బెస్త సంఘం రాష్ట్ర డైరెక్టర్ అశ్వర్థ నారాయణ, అగ్రిబోర్డు మండల అధ్యక్షుడు రఘునాథరెడ్డి, వైఎస్సార్ సీపీ మాజీ మండల కన్వీనర్ రామాంజనేయులు, సర్పంచ్ మూర్తి, ప్రతాప్‌రెడ్డి, నల్లశింగయ్యగారిపల్లి, చంద్రాయునిపల్లి, తోలేటివారిపల్లి, నల్లమాడ, పాతబత్తలపల్లి, కొత్తబత్తలపల్లి తదితర 15 గ్రామ పంచాయతీల రైతులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికత కలిసిన విజ్ఞానంతోనే అభివృద్ధి



సైన్స్ డేలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న ఆర్‌జె.రత్నాకర్ రాజు

ప్రశాంతి నిలయం: మానవతా విలువలు, ఆధ్యాత్మికతను కలగలిపిన విజ్ఞానాన్ని అందించడం ద్వారా సమాజంలో నెలకొన్న అసమానతలు తొలగించి సర్వతోముఖాభివృద్ధి సాధించవచ్చని సత్యసాయి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హైయ్యర్ లర్నింగ్ వైస్ చాన్సలర్ సాయి గిరిధర్ పేర్కొన్నారు. మంగళవారం సత్యసాయి విద్యాసంస్థల్లో జాతీయ సైన్స్ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. వివిధ రాష్ట్రాలకు చెందిన ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు 900 మంది పాల్గొని ఆవిష్కరణలను ప్రదర్శించారు. ప్రతిభ కనబరచిన విద్యార్థులకు, గైడ్ ఉపాధ్యాయులకు సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ రత్నాకర్ రాజు, సత్యసాయి గ్లోబల్ కౌన్సిల్ చైర్మన్ చక్రవర్తి, వైస్ చాన్సలర్ సాయి గిరిధర్ చేతుల మీదుగా మెడల్స్, ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ కేవీ రావు, డాక్టర్ కె. రత్న తదితరులున్నారు.

S.I. & P.C "MAINS" (TM/EM)
'45' DAYS SPECIAL BATCH
ARITHMETIC & REASONING & PURE MATHS
NEW BATCH : 01-03-23 (WED)
Time: 9-30 AM to 5-30 PM
RMC
Opp Nandini Hotel, Sapthagiri Circle, ATP.
9642739156, 8341890325

క్లుప్తంగా

కర్ణాటక మద్యం పట్టివేత


నిందితులను అరెస్ట్ చూపుతున్న పోలీసులు

రామగిరి: కర్ణాటక నుంచి రామగిరి మండలం మీదుగా అక్రమంగా తరలిస్తున్న మద్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వివరాలను మంగళవారం ఎస్ఐ జనార్ధననాయుడు వెల్లడించారు. అందిన సమాచారం మేరకు మంగళవారం ఉదయం రామగిరి సమీపంలో పోలీసులు వాహన తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో అటుగా వచ్చిన మూడు ద్విచక్ర వాహనాలను అడ్డుకుని పరిశీలించగా వివిధ బ్రాండ్లకు చెందిన 864 కర్ణాటక మద్యం బాటిళ్లు బయటపడ్డాయి. కర్ణాటకలోని తిరుమణి నుంచి వీటిని కొనుగోలు చేసినట్లు తరలింపుదారులు ధర్మవరంలోని ఎర్రగుంటకు చెందిన సాకే శివయ్య, సుద్దకుంటపల్లికి నివాసి లక్ష్మీ నాయక్, కుంటిమద్దికి చెందిన సాకే గోపాల్ తెలిపారు. నిందితులను అరెస్ట్ చేసి, వాహనాలను సీజ్ చేశారు.

హెవీ డ్రైవింగ్‌పై ఆర్టీసీలో శిక్షణ

కదిరి అర్బన్: హెవీ డ్రైవింగ్‌పై ఆర్టీసీ ఆధ్వర్యంలో యువతకు శిక్షణ ఇస్తున్నట్లు కదిరి ఆర్టీసీ డీఎం మైనుద్దీన్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. అభ్యర్థులు పదో తరగతి ఉత్తీర్ణతతో పాటు లైట్ మోటార్ వెహికల్ డ్రైవింగ్ కలిగి ఉండాలి. హిందూపురం కేంద్రంగా 30 రోజుల పాటు శిక్షణ ఉంటుంది. శిక్షణ అనంతరం ప్రదానం చేసే సర్టిఫికెట్‌తో రవాణా శాఖ కార్యాలయం ద్వారా హెవీ డ్రైవింగ్ లైసెన్స్ పొందవచ్చు. ఆసక్తి గల అభ్యర్థులు డీఎం కార్యాలయంలో సంప్రదించవచ్చు.

వ్యక్తి గల్లంతు

పెనుకొండ రూరల్: స్థానిక కుమ్మరొడ్డి వీధికి చెందిన భక్తర్‌వలి(45) చేపల వేటకెళ్లి చెరువు నీటిలో గల్లంతయ్యాడు. ఒక్క రోజు ఆలస్యంగా వెలుగు చూసిన ఈ ఘటనకు సంబంధించి ఎస్ఐ రమేష్ బాబు తెలిపిన వివరాలు.. ఆటో డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్న భక్తర్ వలికి భార్య ఆయేషా, కుమార్తె ముబీనా (పెంపుడు కుమార్తె) ఉన్నారు. సోమవారం మధ్యాహ్నం స్థానిక బాబయ్య చెరువులో చేపల వేట సాగిస్తుండగా ప్రమాదవశాత్తు కాలు జారి నీటిలో పడిపోయాడు. లోతైన ప్రాంతం కావడంతో ఈత రాక నీట మునిగిపోయాడు. విషయాన్ని ఆలస్యంగా గుర్తించిన స్థానికులు డయల్ 100కు సమాచారం చేరవేయడంతో సాయంత్రం 5 గంటలకు పోలీసులు, కుటుంబసభ్యులు అక్కడకు చేరుకుని గాలింపు చేపట్టారు. ఆచూకీ లభ్యం కాకపోవడంతో మంగళవారం ఉదయం తిరిగి ప్రయత్నించారు. అయినా ఫలితం దక్కలేదు. దీంతో బుధవారం గజ ఈతగాళ్లను రంగంలో దించనున్నట్లు పోలీసులు తెలిపారు.

ఆఫీస్ ఆటోమేషన్ (CPT-Computer Proficiency Test) కోర్సు ఫీజులో 20% రాయితీతో దరఖాస్తులు
APPSC ద్వారా Group- 2 & 3 Jobs కి మరియు డేటా ఎంట్రీ ఆపరేటర్, సచివాలయాల్లో డిజిటల్ అసిస్టెంట్ & డేటా ప్రాసెసింగ్ మొదలగు ఉద్యోగాలకు AP SBTET ద్వారా Pass అయిన సర్టిఫికేట్ ఉపయోగపడును.
SAI INSTITUTION
(Affiliated by APSBTET),
14/402, Kamala Nagar, ATP.
Cell : 9059723829
Application Last Date : 13-03-2023
Exam Date : April / May 2023

చిగురిస్తున్న ఆశలు

- జిల్లాలో 19 వేల హెక్టార్లలో మామిడి సాగు
- 9 వేల హెక్టార్ల వరకు దిగుబడి వచ్చే అవకాశం
- 16 నుంచే మొదలుకానున్న మొదటి కాపు కటింగ్


లేపాక్షి ప్రాంతంలో పూతతో కళకళలాడుతున్న మామిడి చెట్టు


మొదటి విడత మామిడి కాయలు

హిందూపురం: మామిడి రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. తొలివిడతలో వచ్చిన పూతకు చిన్న చిన్న కాయలు కనిపిస్తుండగా ప్రస్తుతం రెండో విడతలో విస్తారంగా పూత కనిపిస్తుండటంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఎటు చూసినా పూత, పిందెలతో మామిడి చెట్లు నిండుగా ఉన్నాయి. గత ఏడాది కన్నా ఈసారి ధర కూడా బాగానే ఉండే అవకాశాలున్నాయి.

19 వేల హెక్టార్లలో...

జిల్లాలో సుమారు 19 వేల హెక్టార్లకు పైగా మామిడి సాగులో ఉంది. ఇందులో సరాసరి సగానికి పైగా దాదాపు 9 వేల హెక్టార్లు దిగుబడి వస్తాయని అంచనా వేస్తున్నారు. అందులో కూడా మొదటి విడతలో 8 వేల హెక్టార్లలో పెద్ద చెట్ల కాయలు ఉండ వచ్చని ఉద్యానశాఖ అధికారులు అంచనా వేస్తున్నారు.

మార్చి 20 నుంచే మార్కెట్‌లోకి..

మామిడి పంటకు సంబంధించి కాయలు మొదటిగా కాపు వచ్చినవి మార్చి 16 నుంచి కటింగ్ జరిగి 20 నాటికి మార్కెట్‌లోకి అందుబాటులోకి రానున్నాయి. జిల్లాలోని హిందూపురం, కదిరి ప్రాంతాల్లో మార్చి మూడోవారంలో మామిడి పండ్లను కటింగ్ చేస్తారు. తర్వాత రాప్తాడు, ధర్మవరం, పెనుకొండ ప్రాంతాల నుంచి మామిడి పంట మార్కెట్‌లో లభిస్తాయి. ఏప్రిల్ నుంచి జూన్ వరకు అన్ని నియోజకవర్గాల్లో విస్తరంగా మామిడి పంట అందుబాటులోకి వస్తుంది. జిల్లాలోని మామిడికి సంబంధించి బెంగళూరు బెనీషా, మల్లికా, మల్గూబా, రసం, సువర్ణ, చివరగా నీలం తదతర రకాల మామిడి పండ్లు మార్చి నెలఖారు నుంచి జూన్ వరకు మార్కెట్‌లో లభించనున్నాయి.

ఒకవైపు పూత.. మరో వైపు కాయలు

జిల్లాల్లో మామిడి సాగు సంబంధించి ఎన్‌పీ కుంట, కదిరి, హిందూపురం ప్రాంతాల్లో పంట విస్తరంగా సాగులో ఉంది. ఈపాటికే కొన్ని చోట్ల కాయలు కూడా కనిపిస్తున్నాయి. మొదటగా ఇక్కడి నుంచే మార్కెట్‌లోకి కాయలు అందుబాటులోకి వచ్చే అవకాశాలున్నాయి. గత నవంబర్, డిసెంబర్ మాసాల్లో విపరీతమైన చలికారణంగా ముసురుకుంది. మంచుకు తట్టుకుని నిలిచిన తోటల్లో పూత కాయలు కాచాయి. మరోవైపు రెండో విడతగా విస్తారంగా పూత రావడంతో ఈసారి మామిడి దిగుబడి పెరగనుంది.

హిందూపురం నియోజకవర్గంలో సాగు ఇలా..	
హిందూపురం	545.98 ఎకరాలు
లేపాక్షి	398.36 ఎకరాలు
చిలమత్తూరు	160 ఎకరాలు
పరిగి	1001.9 ఎకరాలు

మామిడి పూత బాగుంది



మామిడి సాగుకు సంబంధించి పూత విస్తరంగా కనిపిస్తోంది. గత నవంబర్, డిసెంబర్ మాసాల్లో వచ్చిన పూతకు లేత చిన్న చిన్న పిందెలు, కాయలు ఉన్నాయి. రెండుసారి పూత కూడా నిలిచింది. దిగుబడి ఈసారి అనుకున్నంతగా ఆశాజనకంగా ఉంటుంది. జిల్లాలో హిందూపురం, రాప్తాడు, కదిరి, ధర్మవరం నియోజవర్గాల్లో మామిడి సాగులో ఉంది. ఈఏడాది సరాసరి 9 వేల హెక్టార్ల వరకు దిగుబడి వచ్చే అవకాశాలు ఉన్నాయి.

– చంద్రశేఖర్, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి, శ్రీసత్యసాయి జిల్లా

యువకుడిపై పోక్సో కేసు నమోదు

బుక్కరాయసముద్రం: మండలంలోని చెన్నంపల్లికి చెందిన ఓ యువకుడిపై పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. అదే గ్రామానికి చెందిన ఓ బాలికను పవన్‌కుమార్ అనే యువకుడు మాయమాటలు చెప్పి గత నెల 3వ తేదీన తన వెంట పిలుచుకెళ్లాడు. విషయాన్ని ఆలస్యంగా గుర్తించిన తల్లిదండ్రులు.. బాలిక ఆచూకీ కోసం పలు ప్రాంతాల్లో గాలించారు. ఫలితం లేకపోవడంతో అప్పట్లో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం సాయంతో విజయవాడలో పవన్‌కుమార్ ఉన్నట్లు గుర్తించారు. దీంతో పోలీసులు అక్కడికెళ్లి యువకుడితో పాటు బాలికను అదుపులోకి తీసుకుని మంగళవారం బీకేఎస్ పోలీస్ స్టేషన్‌కు తీసుకువచ్చారు. విచారణ అనంతరం యువకుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శివప్రసాద్ తెలిపారు.

88 మంది సచివాలయ ఉద్యోగులకు షోకాజ్

రాప్తాడు రూరల్: అనంతపురం మండలంలోని సచివాలయాల్లో పనిచేస్తున్న 88 మంది ఉద్యోగులకు ఉన్నతాధికారులు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. బయోమెట్రిక్ హాజరు నమోదులో అలసత్వమే ఇందుకు కారణంగా తెలుస్తోంది. మండల వ్యాప్తంగా మొత్తం 302 మంది సచివాలయ ఉద్యోగులు ఉండగా గత నెల 18 నుంచి 25వ తేదీ వరకూ 20 మంది ఉద్యోగులు బయోమెట్రిక్ హాజరు నమోదు చేయలేదు. అలాగే మరో 68 మంది వంద శాతం హాజరు నమోదులో నిర్లక్ష్యం కనబరిచారు. సెలవులను ఆన్‌లైన్‌లో పొందు పరచలేదు. దీంతో 88 మంది సచివాలయ ఉద్యోగులకు ఏపీ సివిల్ సర్వీసెస్ రూల్స్ 1964 కింద క్రమశిక్షణ చర్యలు ఎందుకు తీసుకోకూడదంటూ ఎంపీడీఓ బాబాఫక్రుద్దీన్ మంగళవారం నోటీసులు జారీ చేశారు. మూడు రోజుల్లోపు సంజాయిషీ ఇవ్వకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు.

సమష్టిగా విజయభేరి మోగిద్దాం

- ఎమ్మెల్సీ వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించుకుందాం
- సమీక్ష సమావేశంలో మంత్రి ఉషశ్రీచరణ్


సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ఉషశ్రీచరణ్, చిత్రంలో ఎంపీ గోరంట్ల మాధవ్, ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య

అనంతపురం రూరల్: ఎమ్మెల్సీ ఎన్నికల్లో సమష్టిగా పనిచేసి విజయభేరి మోగిద్దామని రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి ఉషశ్రీచరణ్ పిలుపునిచ్చారు. వైఎస్సార్‌సీపీ మద్దతుతో పోటీ చేస్తున్న పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డిని, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి రామచంద్రారెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించుకోవాలన్నారు. రుద్రంపేట సమీపంలోని వాల్మీకి భవన్‌లో రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి అధ్యక్షతన నియోజకవర్గ పరిధిలోని వైఎస్సార్‌సీపీ బూత్ కన్వీనర్లు, జెడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీ, సర్పంచ్, ఎంపీటీసీ సభ్యులు, గృహసారథులు, ముఖ్య నాయకులతో ఎమ్మెల్సీ ఎన్నికలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. మంత్రి ఉషశ్రీ చరణ్, హిందూపురం ఎంపీ గోరంట్ల మాధవ్, ఎమ్మెల్సీ మంగమ్మ, ఎమ్మెల్సీ విప్ వెన్నపూస గోపాల్‌రెడ్డి, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బోయ గిరజమ్మ, వైఎస్సార్‌సీపీ అనంతపురం జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య యాదవ్, రాప్తాడు నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడు హరీష్‌యాదవ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి ఉషశ్రీచరణ్ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలను చట్ట సభల్లో అడుగు పెట్టేలా చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి బడుగుల ఆశాజ్యోతిగా నిలిచారని అన్నారు. 18 ఎమ్మెల్సీ స్థానాల్లో 14 మంది బీసీ, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులను నిలిపిన ఘనత జగన్‌కే దక్కుతుందన్నారు. అంతేకాదు తనకు మంత్రి పదవి, మంగమ్మకు ఎమ్మెల్సీ, గిరిజమ్మకు జెడ్పీ చైర్‌పర్సన్‌తో పాటు వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్ష పదవులు సైతం బీసీలకే కల్పించారన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల విజయం కోసం అందరూ కలసికట్టుగా పనిచేయాలని సూచించారు. మెదటి ప్రాధాన్యత ఓటు వైఎస్సార్‌సీపీ అభ్యర్థులకు వేసేలా ఓటర్లకు అవగాహన కల్పించాలన్నారు.

ముంగిటకే సంక్షేమ పథకాలు

సచివాలయ– వలంటీర్ వ్యవస్థ ద్వారా రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలను ప్రజల ముంగిటకే చేరుస్తున్నామని ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి పేర్కొన్నారు. రాప్తాడు నియోజకవర్గంలో పరిటాల కుటుంబం గతంలో సాగించిన అరాచక పాలనను ప్రజలు మరిచిపోలేదన్నారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాతే నియోజకవర్గం సస్యశ్యామలంగా మారిందన్నారు. ప్రతి చెరువుకూ నీరందించడంతో పాటు పేరూరు డ్యాంను నీటితో నింపామన్నారు. ఫ్యాక్షన్ రాజకీయాలకు చెక్ పెట్టడంతో నియోజకవర్గ ప్రజలు సంతోషంగా జీవనం గడుపుతున్నారన్నారు,. పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల గెలుపునకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎన్నికల పరిశీలకులు ఎంఆర్‌సీ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పొరపాట్లకు తావివ్వొద్దు

- ఎన్నికల సిబ్బందికి డీఆర్‌డీఏ పీడీ సూచన


మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ నరసింహారెడ్డి

అనంతపురం అర్బన్: ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ విధుల్లో ఎలాంటి పొరపాట్లకు తావివ్వరాదని పోలింగ్ సిబ్బందికి శిక్షణ నోడల్ అధికారి, డీఆర్‌డీఏ పీడీ ఐ.నరసింహారెడ్డి సూచించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవన్‌లో ప్రిసైడింగ్, పోలింగ్ అధికారుల శిక్షణ కార్యక్రమం జరిగింది. ప్రిసైడింగ్ అధికారి చేపట్టాల్సిన విధులు, బాధ్యతలపై ఈ సందర్భంగా పీడీ అవగాహన కల్పించారు. పోలింగ్ సామగ్రి, ఎలక్టోరల్ రోల్స్, ఓటింగ్ కంపార్ట్‌మెంట్స్, బ్యాలెట్ పెట్టల నిర్వహణ, వివిధ ఫార్మెట్‌లను పూరించడం తదితర అంశాలపై 135 మంది ప్రిసైడింగ్ అధికారులు, 143 మంది పోలింగ్ అధికారులు, 16మంది సెక్టార్ అధికారులు, 16 మంది రూట్ అధికారులకు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ ప్రశాంత్‌కుమార్, ఆర్డీఓలు రవీంద్ర, నిషాంత్‌రెడ్డి, మధుసూదన్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

అంతర్రాష్ట్ర దొంగ అరెస్ట్

- రూ.7.56 లక్షల విలువైన బంగారు నగలు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన జీఆర్‌పీ డీఎస్పీ అబ్దుల్ అజీజ్


నిందితుడిని అరెస్ట్ చూపుతున్న రైల్వే పోలీసులు

గుంతకల్లు: కదులుతున్న రైళ్లు, ప్లాట్‌ఫాంలపై చోరీలకు పాల్పడుతున్న ఓ అంతర్రాష్ట్ర దొంగను రైల్వే పోలీసులు అరెస్ట్ చేశారు. స్థానిక జీఆర్పీ డీఎస్పీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిందితుడి వివరాలను జీఆర్పీ డీఎస్పీ అబ్దుల్ అజీజ్ వెల్లడించారు. జీఆర్పీ ఎస్పీ చౌడేశ్వరి ఆదేశాల మేరకు రైళ్లలో చోరీల నియంత్రణకు జీఆర్పీ పటిష్ట చర్యలు తీసుకుంది. ఇందులో భాగంగా మంగళవారం ఉదయం గుంతకల్లు రైల్వే స్టేషన్‌లో అనుమానాస్పదంగా తిరుగుతున్న ఆకాష్‌ను రైల్వే పోలీసులు అడ్డుకుని వివరాలు ఆరా తీస్తుండగా పారిపోయేందుకు ప్రయత్నించాడు. ఆ సమయంలో సీఐ బీవీ నగేష్, సిబ్బంది వెంటాడి ఆకాష్‌ను అదుపులోకి తీసుకుని రైల్వే పోలీసు స్టేషన్‌కు తరలించారు. అతని వద్ద నుంచి 130 గ్రాముల బంగారు నగలు స్వాధీనం చేసుకున్నారు. విచారణలో తన పూర్తి పేరు ఆకాష్ ప్రతాప్‌సరోదిగా పేర్కొన్నాడు. మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లా ఖండార్ తాలూకా భీమినగర్‌కు చెందినవాడు. ప్రస్తుతం లాథూర్ జిల్లా అహమ్మద్‌పూర్ లోని హనుమాన్ తికడిలో నివాసముంటున్నాడు. జల్సాలకు అలవాటు పడిన ఆకాష్.. బేల్దారి పనులతో వచ్చే సంపాదన తన అవసరాలకు సరిపోకపోవడంతో దొంగతనాలు చేయడం మొదలు పెట్టాడు. మూడేళ్ల క్రితం తిరుపతిలోని గోవిందరాజుల స్వామి ఆలయంలో బంగారు కిరీటాలు అపహరించుకెళ్లాడు. ఈ కేసులో పట్టుబడి జైలు శిక్ష కూడా అనుభవించాడు. అనంతరం బయటకు వచ్చిన ఆకాష్ రైళ్లల్లో చోరీలను ఎంచుకున్నాడు. ప్లాట్‌ఫాంలపై, రైళ్లలో నిద్రిస్తున్న ప్రయాణికుల బ్యాగ్‌లు అపహరించుకెళ్లేవాడు. రైలు కదులుతున్న సమయంలో మహిళల మెడలోని బంగారు నగలు లాక్కొని ఉడాయించేవాడు. ఇప్పటికే ఆకాష్‌పై పలు రాష్ట్రాల్లో కేసులు నమోదయ్యాయి. విచారణ అనంతరం నిందితుడు దాచి ఉంచిన రూ.7,56,900 లక్షల విలువ చేసే బంగారు నగలు స్వాధీనం చేసుకున్నారు. అంతర్రాష్ట్ర దొంగను పట్టుకోవడంలో చొరవ చూపిన జీఆర్పీ సీఐ నగేష్, ఎస్ఐలు మహేంద్ర, గోపాల్, హెడ్ కానిస్టేబుళ్లు రాజశేఖర్, సాయి, శరేశ్వరరావు, కానిస్టేబుళ్లు ప్రకాష్, అలీ, నబీరసూల్, గాదిలింగ, నరసింహ, పుల్లయ్య, గోపాల్‌ను ఈ సందర్భంగా డీఎస్పీ అభినందించారు. విలేకరుల సమావేశంలో ఆర్పీఎఫ్ సీఐ పి.రమేష్‌గౌడ్, ఇంటిలిజెన్స్ ఇన్‌స్పెక్టర్ బెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

REAL ESTATE

PLOT FOR SALE

■ GMR COLONY, Alamuru Road, Anantapur. AHUDA approved open plots for sale. Cont: 9392183377, 9281024684, 9391756322. [A-456]

■ HIGHWAY COUNTY, Beside APS Warehousing Godowns, near SVIT, NH 44, AHUDA approved plots for sale. 9392183377, 9281024684, 9391756322. [A-457]

■ GREEN COUNTY, Rapthadu, NH 44, AHUDA approved open plots for sale. Cont: 9392183377, 9281024684, 9391756322. [A-458]

SERVICES

బంగారం కొనబడును

■ మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్ / ఫైనాన్స్‌లో తాకట్టులో ఉన్నవి, మా డబ్బుతో విడిపించి కొనబడును. స్పాట్ క్యాష్ / షిఫ్టింగ్ (రిటైర్డ్ పోలీస్ డిపార్ట్‌మెంట్) గోల్డ్‌ట్రేడింగ్ కం. ఫోన్: 73821 14647 [V- 6087]

GOLD FINANCE

■ బంగారం బ్యాంకులలో/ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) (100% జెన్యూన్) ✆ 90009 92521 [B-2281]

WANTED

■ MS ENTERPRISES (DSA) HIRING Female Telecallers, Salary 8000 + Incentives, Q: DEGREE, Location. Bellary bypass, ATP. 9121510154, 8466860623. [A-433]

■ Corporate బ్యాంక్‌లలో పనిచేయుటకు Cashiers, Clerks,Senior Officer, (Sales) Attenders కావలెను. జీ: 12,000 -40,000 వరకు. ✆ 9642506425, 8297797197. [T-4032]

■ మా ఆఫీస్‌లో వర్క్ చేయుటకు లేడి టెలికాలర్స్ కావలెను. Q : 10th, జీతం: 6,000 to 10,000 + ఇన్సెంటివ్స్, సెల్: 9133223529, 9666983886. [A-734044]

■ Wanted PRO's to work in Reputed International School in Anantapur. Cell: 9100314499, 9440354441. [A-441]

■ అనంతపురం లోకల్ నందు జాబ్ చేయడానికి Male / Female కావలెను. Sal : 7,000/- to 10,000/-. Contact : 8121661651, అనంతపురము. [A-734046]

■ అగ్రికల్చర్ ఫీల్డ్ ఆఫీసర్ వర్క్ చేయుటకు 10th to డిగ్రీ అర్హతగల వారు కావలెను. జీతం : 14 వేలు + 2,500. సెల్: 9908466458. [A-734045]

■ ప్రముఖ సంస్థ నందు మీ ఇంటి దగ్గర ఉంటూ పార్ట్‌టైం/ఫుల్‌టైం పోస్టల్ కవర్లపై అడ్రస్‌లు వ్రాయుటకు స్త్రీ/పురుషులు కావలెను. నెలకు 10-15వేలు వరకు సంపాదన. ఫ్రీ బుక్‌లెట్ కొరకు 9059509586 [G-781918]

■ ప్రముఖ రిలయన్స్ లైఫ్ ఇన్సూరెన్స్ కం. అనంతపూర్ బ్రాంచ్‌లో (P/F) జాబ్స్ కలవు. Qly : Any డిగ్రీ, Age : 24-50(M/F) Sal : 20-30K (P.M) PF + ఇన్సెంటివ్స్/ ప్రమోషన్స్. సెల్ : 98857 28036 [L-794975]

■ మీ ఇంటి వద్దనే వుండి మీ మొబైల్ ద్వారా మా కంపెనీ యొక్క Message పంపుతూ వారానికి3500/- సంపాదించుకోండి. వాట్సాప్ చేయండి. 9573633520, 9059633520 [M-1190580]

■ ఇంటి దగ్గర ఉండి మా కంపెనీ బల్బులు ఫిట్‌చేసి ఇవ్వడం ద్వారా నెలకి 15 వేలు ఆపైన జీతం కలదు. మరిన్ని వివరాలకు సంప్ర : 90004 08325 [L-520]

■ హైదరాబాద్‌లోని ఓల్డేజ్ హోం కొరకు రెసి॥ లేడీ కేర్‌టేకర్స్, రెసి॥ వంటవారు (వ. 35-40) & ఆయాలు కావలెను. మంచి జీతం, ఫ్రీ వసతి+ భోజనం. ఫోన్ : 9700006699, 7981467036 [H-793518]

■ ప్రముఖ సంస్థ నందు మీ ఇంటి దగ్గర ఉండి, పార్ట్ / ఫుల్ టైమ్ గా వర్క్ చేస్తూ ప్రతి రోజూ రూ. 500 నుండి రూ. 600 వరకు సంపాదించే అవకాశం. డైలీ పేమెంట్స్. సంప్ర: 9985782069. [A-734047]

■ గ్రాడ్యుయేషన్ అయిన, కంప్యూటర్ పరిజ్ఞానం గల యువతులు ప్రముఖ ఛానల్‌లో ఆఫీస్ అసిస్టెంట్లుగా కావలెను. సంప్రదించండి. సెల్: 9966428888. [A-734038]

■ Wanted Female Front Office Executive with good communication skills to work in International School. 7095399992 / 3. [A-442]

■ ధర్మవరంలో కార్గో ఆఫీస్ నందు జాబ్ చేయుటకు మేనేజర్-1 & అసిస్టెంట్ మేనేజర్-1 (పురుషులు మాత్రమే) కావలెను. Q: డిగ్రీ + M.S.ఆఫీస్, M.S.Excel, Tally వచ్చిన వారికి ప్రాధాన్యత. 3 నెలలు ట్రైనింగ్, ట్రైనింగ్‌లో 10 వేలు, ట్రైనింగ్ తర్వాత జీతం: 12 వేలు. లోకల్ వారికి ప్రాధాన్యత. సెల్: 7013370695. [A-734048]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

బైక్‌ను ఢీకొన్న బస్సు – యువకుడి మృతి


సయ్యద్ బాబా మృతదేహం

సోమందేపల్లి: ద్విచక్ర వాహనాన్ని బస్సు ఢీకొన్న ఘటనలో ఓ యువకుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... హిందూపురానికి చెందిన సయ్యద్ బాబా (25), అదే ప్రాంతానికి చెందిన తన స్నేహితుడు జాకీర్ బాషాతో కలసి సోమందేపల్లి మండలం పేటకుంట సమీపంలో ఉన్న పారిశ్రామిక వాడలోని ఓ కంపెనీలో వెల్డింగ్ పనికి వచ్చాడు. సోమవారం రాత్రి పని ముగించుకుని ద్విచక్ర వాహనంపై తిరుగు ప్రయాణమయ్యారు. పారిశ్రామిక వాడ నుంచి బయటకు వస్తున్న క్రమంలో వేగంగా దూసుకువచ్చిన శిల్పా ట్రాన్స్‌పోర్టుకు చెందిన బస్సు ఢీకొంది. ఘటనలో తీవ్రంగా గాయపడిన సయ్యద్ బాబాను హిందూపురం ఆస్పత్రికి తీసుకెళ్లారు. చికిత్సకు స్పందించిక అతను మృతి చెందాడు. పరిస్థితి విషమంగా ఉన్న జాకీర్ బాషా బెంగళూరులోని ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఘటనపై దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ విజయ్‌కుమార్ తెలిపారు.

పెళ్లి కాలేదన్న బెంగతో యువకుడి ఆత్మహత్య

రాయదుర్గం: మూడు పదుల వయసు వచ్చినా పెళ్లి కాలేదన్న బెంగతో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు... రాయదుర్గంలోని శాంతినగర్‌కు చెందిన వంగా రాజశేఖర్ (33)కు పెళ్లి చేసేందుకు కుటుంబసభ్యులు సంబంధాలు చూస్తున్నారు. ఇందులో ఏ ఒక్కటీ కుదరలేదు. ఈ క్రమంలోనే తన తోటి మిత్రులందరికీ పెళ్లిలవుతుండంతో రాజశేఖర్ కొంత కాలంగా మానసికంగా కుదేలయ్యాడు. ఇటీవల తండ్రి సుంగులప్ప మృతి చెందాడు. నలుగురు అన్నదమ్ముల్లో మూడో వాడిగా ఉన్న తనకు ఇక పెళ్లి జరగడం కష్టమనే భావన అతణ్ని మరింత వేధించసాగింది. దీంతో మంగళవారం ఉదయం జీన్స్ ప్యాంట్ల తయారీకి ఏర్పాటు చేసుకున్న ప్రత్యేక గదిలో పైకప్పుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న రాయదుర్గం ఎస్ఐ సుమన్.. అక్కడకు చేరుకుని పరిశీలించి కేసు నమోదు చేశారు.

వ్యక్తి బలవన్మరణం

కుందుర్పి: అప్పులు తీర్చే మార్గం కానరాక ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు.. కుందుర్పి మండలం బెస్తరపల్లికి చెందిన గొల్ల ఈరన్న (47)కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. వ్యవసాయ పనులతో పాటు చింత పండు వ్యాపారం చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. గతంలో సాగు చేసిన పంటలకు గిట్టుబాటు ధర లేక రూ.2.40 లక్షల నష్టం వచ్చింది. ఈ క్రమంలోనే చింతపండు వ్యాపారంలోనూ రూ.2.60 లక్షలు నష్టపోయాడు. దీంతో రూ.5 లక్షల అప్పులు ఎలా తీర్చాలో తెలియక వారం రోజులుగా మదనపడేవాడు. దీంతో మంగళవారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో దూలానికి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఘటనపై దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

రాష్ట్రస్థాయి సైన్స్‌ఫేర్‌లో సత్తా చాటిన జిల్లా విద్యార్థులు

అనంతపురం: గత నెల 27, 28 తేదీల్లో విజయవాడలోని ఆంధ్ర లయోల కళాశాల వేదికగా సాగిన రాష్ట్ర స్థాయి సైన్స్‌ఫేర్‌లో ఉమ్మడి అనంతపురం జిల్లాకు చెందిన ఇద్దరు విద్యార్థులు ప్రతిభ చాటారు. హెల్త్ అండ్ క్లీన్ నెస్ విభాగం అనంతపురం జిల్లా శెట్టూరు మండలం కైరేవు ఎంపీయూపీఎస్ విద్యార్థి జి.భానుప్రియ ద్వితీయ స్థానాన్ని, శ్రీసత్యసాయి జిల్లా నాగసముద్రంలోని జెడ్పీహెచ్ఎస్ విద్యార్థి ఎస్.లక్ష్మీనరసింహ తృతీయ స్థానాన్ని దక్కించుకున్నారు.

లక్ష్యానికి చేరువగా స్త్రీనిధి రుణాల మంజూరు

- ఉమ్మడి జిల్లా స్త్రీనిధి ఏజీఎం కామాక్షయ్య


మాట్లాడుతున్న ఏజీఎం కామాక్షయ్య

కూడేరు: ఉమ్మడి జిల్లాలో 2022–23 ఆర్థిక సంవత్సరానికి గాను రూ.310 కోట్ల స్త్రీ నిధి రుణాలు మంజూరు లక్ష్యంగా నిర్దేశించుకోగా.. ఇప్పటి వరకూ రూ.235 కోట్లను డ్వాక్రా మహిళలకు మంజూరు చేసినట్లు స్త్రీనిధి ఏజీఎం కామాక్షయ్య తెలిపారు. కూడేరు మండలానికి సంబంధించి రూ.5 కోట్ల రుణాలు మంజూరు లక్ష్యంగా నిర్దేశించుకోగా.. రూ.3.5 కోట్లు మాత్రమే మంజూరు చేయడంపై మంగళవారం ఆయన క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టారు. వెనకబాటుకు కారణాలను ఏపీఎం, సీసీలు, యానిమేటర్లతో ఆరా తీశారు. ఈ నెలాఖరుకు నిర్దేశించిన లక్ష్యం నెరవేరాలని ఆదేశించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. అనంతపురం జిల్లాకు రూ.150 కోట్ల టార్గెట్‌కుగాను రూ.110 కోట్లు, శ్రీసత్యసాయి జిల్లాలో రూ.160 కోట్లకు గాను రూ.125 కోట్ల స్త్రీనిధి రుణాలు మంజూరు చేసినట్లు పేర్కొన్నారు. ఇందులో 96 శాతం వసూళ్లు పక్కాగా జరిగాయన్నారు. సిబ్బంది అలసత్వం కారణంగా రూ.5 కోట్ల రుణాల వసూళ్లలో జాప్యం చోటు చేసుకుంటోందని, ఈ పరిస్థితిని అధిగమించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. బ్యాంకులతో సంబంధం లేకుండా మంజూరు చేసే ఈ రుణాలను సద్వినియోగం చేసుకునేలా మహిళా సంఘాలను చైతన్య పరచనున్నామన్నారు. రుణాల చెల్లింపు విషయంలో ఎలాంటి పరిస్థితుల్లోనూ నగదును సిబ్బంది చేతికి ఇవ్వరాదని, సంఘం ఖాతాల్లోకి నేరుగా జమ చేయడమో, ఫోన్‌పే ద్వారా జమ చేయడమో చేయాలని సూచించారు. తప్పనిసరి పరిస్థితుల్లో సిబ్బంది చేతికి నగదు అందజేస్తే అందుకు తగిన రసీదు తక్షణమే తీసుకోవాలన్నారు. స్త్రీనిధి రుణం మంజూరు, వసూళ్లలో అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని సిబ్బందిని హెచ్చరించారు. ఇప్పటికే ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 8 మందిపై సస్పెన్షన్ వేటు వేసినట్లు గుర్తు చేశారు.